# జెన్ జీరో ఇంక్

## - నిర్మలాదిత్య



### నాంది

*(లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్థిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మథనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత -

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రంపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్ధార్థ్(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కేరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్థల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీకి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే ... )

***లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్థిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మధనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).***

అటు తరువాత -

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్దార్థ్(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కెరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్థల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీ కి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి. లక్ష్మి బాయ్ ఫ్రెండ్ లారెన్స్ ఎఫ్.బి.ఐ కి పనిచేస్తున్నాడు.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే ... )

# పాల పుంత

## (మొదలు)

**ఆయషా, అరసుల** ఎంగేజ్మెంట్ వార్త తెలిసిన వెంటనే లక్ష్మి కి చాల సంతోషం వేసింది. కానీ, ఆయషాతో మాట్లాడిన తరువాత మనస్సు, మనస్సులో లేదు. అంతులేని సంతోషం తో ఉన్న మనస్సులో ఏదో ఒక మూల అసంతృప్తి. ఇంకా ఏదో అసంపూర్ణంగానే ఉండిపోయిందన్న భావన. అదేమో అంతుబట్టడం లేదు. అమ్మను కలవాలనిపించింది. నాన్న తో మాట్లాడాలనిపించింది. లారెన్స్ తో ఆదివారం లంచ్ కి ఇంటికి వెళ్ళుతున్నానని చెప్పి బయలు దేరుతుంటే, లారెన్స్ కొంచెం ఆశ్చర్య పడినట్లే వున్నాడు. వీకెండ్స్ మొత్తం ఇద్దరూ కలిసే తిరిగే వాళ్ళు, లక్ష్మి తల్లి తండ్రులను కలవాలన్నా కూడా.

ఒంటరిగా వచ్చిన లక్ష్మి ని చూసి సీత, విశ్వం లు కూడా ఆశ్చర్య పడ్డారు.

“లారెన్స్ ఎక్కడా? ఒంటరిగా వచ్చావు,” మాటలు నాన్చకుండా అడిగేసింది సీత.

“ఏం? నేను ఒంటరిగా రాకూడదా?” తటాలున జవాబిచ్చింది లక్ష్మి .

విశ్వం, సీతతో ఆ విషయం పై మాటలు పొడిగించనవసరము లేనట్లు ముఖం పెట్టి, లక్ష్మి ని దగ్గరికి తీసుకొని ఇంట్లోకి తీసుకెళ్ళాడు. సీతకు విషయం అర్థం అయ్యి “ఏమి తింటావే పిల్లా, దోసెలు వేయనా. నీ కిష్టమైన పీ నట్ చట్నీ కూడా చేస్తాను.” ఆప్యాయంగా లక్ష్మి తల దువ్వుతూ కిచెన్ వైపు అడుగులు వేసింది.

సీత వేడి, వేడిగా దోసలు వేస్తుంటే, విశ్వం లక్ష్మి పక్కనే కూర్చుని అప్పుడప్పుడు తనూ ఒక ముక్క దోస తీసి లక్ష్మి నోట్లో ఆప్యాయంగా పెడుతున్నాడు. మాటల మధ్యలో సీత, “అన్నట్టు ఆయషా ఫోన్ చేసింది. తనకు ఎంగేజ్మెంట్ అయ్యిందట కదా. “

“అవును. నేనే చెప్పాలనుకున్నాను. ఇంకా నా సంగతేమిటి, అన్నదే కదా నీ ప్రశ్న.”

లక్ష్మి కి తను స్ట్రెస్ లో ఉన్నానన్న విషయం, సీత, విశ్వం లకు తెలిసిపోయిందని కొంచెం బాధ పడింది. లారెన్స్ తో లివింగ్ రిలేషన్షిప్ మొదలెట్టి దాదాపు రెండు ఏళ్ళు అయ్యింది. ఇద్దరూ, బాగానే ఉన్నారు. ఇంకా ఒకరంటే, ఒకరికి అంతు

లేని ప్రేమ. కానీ లారెన్స్ రింగ్ ఇచ్చి ప్రపోజ్ ఇంత వరకు చేయలేదు. ఎప్పుడు చేస్తాడో కూడా తెలియదు. బంధు జనాలనుంచి, స్నేహితులనుంచి అప్పుడే ప్రశ్నలు మొదలయ్యాయి.

“నీకు ఎంగేజ్మెంట్ అయ్యితే, అంతకన్నా కావాలసినదేముంది మాకు. కానీ నేను ఆ ఉద్దేశ్యంతో ఆయషా గురించి మాట్లాడ లేదు. ఆయషా నీకు పని చేయడం తో బాటు, మంచి స్నేహితురాలు కదా. అలా ఆ పిల్ల కూడా మనింట్లో బాగా కలిసిపోయింది. తనకు శుభకార్యం కావడం మనకూ సంతోషమే కదా.”

లక్ష్మి సీత మాటలు విని, తను తొందర పడ్డానని తెలుసుకుంది. తన గొంతు మామూలుగానే చేసుకొని, ఆయషా, అరసుల ఎంగేజ్మెంట్ ఎలా అయ్యింది, వారి కాబోయే పెళ్లి కార్యక్రమాల గురించి చెప్పింది.

“అంటే, ఆయషా ప్రీ వెడ్డింగ్ సంబరాలకు ఒక క్రూయిజ్ పడవ మొత్తం బుక్ చేసేసారా?” ఆశ్చర్యంగా అడిగాడు విశ్వం.

“అవును నాన్నా. అరసు పి.ఎల్. గ్రూప్ కంపెనీలకు ఏకైక వారసుడు కదా. డబ్బుకు కొదువేముంది? ఆయేషా, నన్నూ, లారెన్స్ ను కూడా ఆ క్రూయిజ్ సంబరాలకు పిలిచింది.”

“ఎంజాయ్ చేసి రండి,” అంది సీత.

లంచ్ తరువాత వీడ్కోలు తీసుకొని డౌన్ టౌన్ లోని తన అపార్ట్మెంట్ కు బయలుదేరుతుంటే, లక్ష్మి కి సీత కళ్ళలో ఏదో దిగులు కనిపించింది. లక్ష్మి కి కూడా పెళ్లి అయ్యిపోతే బాగుందన్న ఆలోచనే దానికి కారణం అని లక్ష్మి కి తెలుసు. కానీ ఈ దేశం వచ్చాక, ఇక్కడి పద్ధతులనే అనుసరించాలి కదా. తను లారెన్స్ మీద ఎక్కువ ప్రెషర్ పెడితే మొదటికే బెడిసికొట్టి, బ్రేక్ అప్ కి దారి తీయొచ్చు. తను లారెన్స్ ను గాఢంగా ప్రేమిస్తున్నది. విడి పోవడం ఇష్టం లేదు. కానీ ప్రాక్టికల్ గా కూడా ఉండాలి అని మనస్సులో మరో రోదన. మరో ఆరు నెలలో లారెన్స్ నుంచి ప్రపోజల్ రాకపోతే, విడి పోవడానే ఇద్దరికీ మంచిదనుకుంది. కానీ ఆ విషయం లారెన్స్ కు ఎలా చెప్పడం? ఎప్పుడు చెప్పాలి?

అపార్ట్మెంట్ కు వెళ్లిన తరువాత లారెన్స్ సీత, విశ్వం ఎలా ఉన్నారని అడిగాడు. పొడి పొడి గానే జవాబు చెప్పింది లక్ష్మి , మళ్ళీ అమ్మ, నాన్న ల వద్ద జరిగిన సంభాషణ గుర్తు తెచ్చుకోవడం ఇష్టం లేనట్లు.

లారెన్స్ కిచెన్ సింక్ లో లీక్ అవ్వుతున్న టాప్ ను రిపేర్ చేస్తున్నాడు. లారెన్స్ తో ఇన్ని రోజులు కలిసి ఉన్నది, పెళ్ళై నట్లే ఉంది. కానీ నిజం – పెళ్లి కాలేదు. లక్ష్మి మదిలోని ఆలోచనలు పసి కట్టి నట్లు, “ఎంటి ఏదో ఆలోచిస్తూ డల్ గా

ఉన్నావు. చీర్ అప్," అంటూ లక్ష్మి ని హగ్ చేసుకొని ముద్దు పెట్టాడు. లక్ష్మి తన ఆలోచనలు పక్కకు పెట్టి, లారెన్స్ కౌగిలిలో ఒదిగి పోయింది.

"ఆయషా ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్ వచ్చే వారమే కదా. మియామీ నుంచే పడవ క్రూయిజ్ మొదలు. లెట్స్ ఎంజాయ్," అన్నాడు లారెన్స్.

"నాకైతే సమస్య లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు సెలవు తీసుకోవచ్చు. ఆయషా ఎలాను ఇక రాదు. ఉన్న మిగిలిన నలుగురు ఉద్యోగులను ఒక వారం ఇంట్లో నుంచే పని చేయమని అడుగుతాను. ఆఫీసు ఒక వారం మూసి వేస్తాను."

"నేను వెకేషన్ అడిగాను. ఇచ్చారు కానీ మా ఆఫీస్ సంగతి తెలుసు కదా. ఏదో కొందరు పరారీలో ఉన్న కొందరు నేరస్థులను పట్టుకోవాలట. కాబట్టి నేను వెకేషన్ లో ఉన్న నా ధ్యాస, నేరాల మీద, ఆ నేరాలు చేస్తున్న వారి మీద, ఎంతోకొంత ఉంటూనే ఉంటుంది. అన్నట్టు ఆయషా సంగతేమిటి? తను ఈ పెళ్లితో నీ కంపెనీ వదిలేసినట్లేనా?"

"అన్నట్లే. నీకు చెప్పుదామనే అనుకుంటున్నాను. ఆయషా ఈ క్రూయిజ్ కు పిలుస్తూ, తను తన పనికి రాజీనామ చేస్తున్నట్లు కూడా చెప్పింది. మరో సర్ప్రైజ్. తను నా కంపెనీని కొనడానికి మంచి ఆఫర్ కూడా ఇచ్చింది."

"తనకు నీ కంపెనీ తో పనే మిటి? తను కొని ఏమి, చేసుకుంటుంది?"

"అదే ప్రశ్న వేసాను. మా కంపనీ ఆర్థిక నేర పరిశోధనలకని డెవలప్ చేసిన పని ముట్లు పి.ఎల్. గ్రూప్ ఇంటర్నల్ ఆడిట్ కి ఉపయోగ పడతాయి అన్నది. అలానే మేము డెవలప్ చేసిన సాఫ్ట్వేర్ సొల్యూషన్ లకు ఒక పేరు ఇచ్చి, పి.ఎల్. కంపనీ బ్రాండ్ క్రింద, ప్రొడక్ట్ రూపంలో ప్రపంచమంతా అమ్మాలన్న ఆలోచన కూడా ఉందంది. "

"మరి నీకు కావాలసిన ధర దొరికితే అమ్మేయ వచ్చు కదా?"

"అమ్మడానికి సమస్య లేదు. మా బ్యాంక్ వాళ్లకు ఆయషా ఇచ్చిన ప్రపోజల్ పంపాను. మంచి ఆఫర్ అని మా బ్యాంక్ కూడా చెప్పింది. మల్టీ మిలియన్ డాలర్ల ఆఫర్. ఒక వేళ నేనే ఐ.పి.ఓ రౌట్ లో వెళ్తే కూడా అంత రాదేమో?"

"మరి ఆలస్యం దేనికి?"

“నిన్ననే కదా బ్యాంక్ వాళ్ళతో మాట్లాడింది. వారు పూర్తి రిపోర్ట్ ఇవ్వడానికి మరో వారం రోజుల టైం అడిగారు. కానీ నేనే కొంత వెనుకంజ వేస్తున్నాను. అమ్మేసిన తరువాత, ఆ డబ్బుతో, ఇట్టే రిటైర్ అయ్యి పోవచ్చు. జీవితాంతం ఇక పని చేయాల్సిన అవసరం లేదు. కానీ పనీ, పాటా లేకుండా సమయం తో ఏం చేయాలి? నేను రిటైరు అవ్వడానికి ఇంకా చాల సమయం ఉంది.”

“అవును. అమ్మేసిన తరువాత నీవు ఊరికే ఉండడం అసాధ్యం. ఆమ్ ష్యూర్, నువ్వింకో కంపెనీ మొదలెడతావు. “

“ఆ పని చేసినా చేయ వచ్చు. ఆయషా ఎంగేజ్మెంట్ తరువాత తనకు జరిగినట్లే మా కంపెనీకి కూడా తెగ మార్పులు వస్తున్నాయి. అమ్మేసిన తరువాత కూడా నేను కావలసినన్ని రోజులు ఇదే కంపెనీకి సీ.ఈ. ఓ. గా పనిచేయొచ్చు నని ఆయషా చెప్పింది. కాదంటే పి ఎల్. గ్రూప్ కి ఉద్యోగినైపోతాను. నాకే ఇబ్బందిగా ఉంది. నేను స్వతంత్రంగా బ్రతకాలనుకున్నాను. నా కంపెనీ మొదలు బెట్టిందే అందుకు. ఇప్పుడు ఆయషా కు నా కంపెనీ అమ్మేసి, నేనే ఆవిడ క్రింద పనిచేయడం ఇంపాజిబుల్.”

“ఓకే. సమయం ఉంది కదా. ఆలోచించి మంచి నిర్ణయానికే రా. రాబోయే కాలమంతా ఎక్సైటింగా ఉండబోతుంది. ఏమంటావు?”

“ఆఫీసు విషయంలో అయ్యితే ఎక్సైట్మెంట్ తప్పకుండా ఉంది…”

లక్ష్మి వాక్యం పూర్తి చేయకుండా, ఆలా మాటలు, అర్థోక్తంగా వదిలి వేయడం లోని అర్థం లారెన్స్ కు తెలుసుండాలనే అనిపించింది లక్ష్మి కి, లారెన్స్ ముఖవలికలు చూస్తే. కానీ ఎక్కడో, ఒక వేళ అర్థం కాకపోయుంటే, అన్న అనుమానం కూడా పీడించ సాగింది.

ఆయషా లక్ష్మి , లారెన్స్ లను క్రూయిజ్ కి పిలిపించిన రోజు వచ్చేసింది. మియామీ పోర్ట్ లో ఇలాంటి క్రూయిజ్ ఓడల కనే బిస్కెన్ బే పక్కన కట్టిన రేవు దగ్గరికి లారెన్స్ కారులోనే బయలు దేరారు. కారు టెర్మినల్ పక్కన పార్క్ చేసి ఓడ లోకి అడుగు పెట్టారు. అప్పటికే ఆ ఓడ నంతా ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్ థీమ్ తో అలంకరించేసారు. అందరు గెస్ట్స్ లకు సముద్రం చూడడానికి బాల్కనీ తో పాటు ఉన్న అపార్ట్మెంట్ ల లాంటి గదులు ఇచ్చారు.

ఓడ ఎక్కినప్పటి నుంచి విరామం లేని వినోదమే. ఉన్న మూడు థియేటర్ ల లోను ఏదో ఒక కార్యక్రమం పెట్టారు. బ్రాడ్వే నాటకాల తో పాటు, మిలియన్ లు పోస్తే కానీ స్టేజ్ మీద కెక్కని పాప్ స్టార్ లు, హాలీవుడ్, బాలీవుడ్ లాంటి సినీ పరిశ్రమ లోని కళాకారులు ఆ సంబరాలకోసం ప్రదర్శనలు ఇస్తున్నారు. పదవ డెక్ స్విమ్మింగ్ పూల్ పక్కన, ప్రతీ అంతస్తులో ఉన్న రెస్టారెంట్, బార్ లలో ప్రపంచంలో పేరొందిన చెఫ్ లు, బార్ టెండర్ లు అథితు లకు కావలసినవి శ్రద్ధతో చేసి అందిస్తూనే ఉన్నారు.

ఆయషా అంత తీరిక లేని సమయంలోనూ లక్షి , లారెన్స్ లను పలుకరించి అన్ని ఏర్పాట్లు సవ్యంగానే జరిగాయని కన్ఫర్మ్ చేసుకుంది. మొదటి రోజు, పడవ సముద్రయానం కే పరిమితం చేసారు. ఆ రోజంతా లక్షి , లారెన్స్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నా, సాయంత్రం అయ్యే సరికి, తనకు అర్జంట్ గా ఆఫీస్ పని తగిలిందని లారెన్స్, లక్షి ని వదిలేసి వెళ్లి పోయాడు. వచ్చిన వారందరికీ డిన్నర్ తో బాటు ప్రోగ్రాం ఆరెంజ్ చేసారు. వచ్చిన అతిధుల సంఖ్య బట్టి టేబుల్ ఏర్పాట్లు చేశారు. కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి. లక్షి కూర్చున్న టేబిల్ లారెన్స్, లక్షి కి మాత్రం పరిమితం చేసారు. ప్రోగ్రాం మొదలయ్యే సరికి వస్తానన్న లారెన్స్ అంతు లేదు. లక్షి ప్రోగ్రాం మొదలవ్వుతున్న దని మెసేజ్ పంపింది. మరి కొద్ది సేపట్లోనే రావడానికి ప్రయత్నిస్తున్నానని లారెన్స్ జవాబిచ్చాడు.

వంటరిగా కూర్చున్న లక్షి పక్కన ఒక అరవై పై బడిన వ్యక్తి వచ్చి ‘ కేన్ ఐ జాయిన్? ‘ అని అడిగాడు.

లక్షి తలెత్తి చూసింది. ఒత్తయిన నెరిసిన తెల్లని జుట్టు తో, మెరుస్తున్న కళ్ళతో, చిరునవ్వు తో అలా పలుకరిస్తున్న మనిషిని చూస్తూనే లక్షి కి గౌరవ భావం కలిగింది. లారెన్స్ వస్తున్న జాడ లేదు. వస్తే కూడా, మరో కుర్చీ టేబిల్ దగ్గర ఏర్పాటు చేయవచ్చు. ‘ ష్యూర్ ‘ అంటూ తన పక్క కుర్చీ చూపెట్టింది.

‘నా పేరు వినోద్, “ అన్నాడతను.

“నా పేరు లక్షి . మీకు ఆయషా తెలుసా లేక అరసునా? ఎలా?” అంది లక్షి .

“ ఆయషా, అరసు ఇద్దరూ చిన్నప్పటి నుండి తెలుసు. నన్ను పిలిచింది అరసు తండ్రి పి.ఎల్. ఆయనకు, నాకు చాల రోజుల నుండి అనుబంధం ఉంది. నిన్ను ఆయషా పిలిచిందనుకుంటాను.”

“అవును. మీకు పి.ఎల్. చాల రోజుల నుండి తెలుసంటే, ఇక్కడికి వచ్చిన అతిథులలో మీకు చాల మంది తెలిసే ఉండాలి. మీరు కూడా పి.ఎల్. కంపెనీలలో పని చేశారా?”

"ఈ పాటలు పాడే వారు, సినీ పరిశ్రమ లో పని చేసే సెలబ్రెటీ లు అందరికీ తెలిసే వుంటారు. కాదంటే నాకు ఈ ఓడెక్కిన ప్రతీ బిజినెస్ అధినేత కూడా తెలుసు. దానికి కారణం పి.ఎల్. కు పని చేయడం కాదు. నేను భారత ప్రభుత్వానికి పని చేయడం. టాక్స, ఆర్థిక విభాగాలలో రిటైర్ అయ్యే వరకు పని చేసాను. అందుకే వీరందరూ, ఎప్పుడో ఒకప్పుడు నేను పని చేస్తున్న ఆఫీస్ కు వచ్చి, నన్ను కలిసిన వారే."

లక్షి , వినోద్ మాట్లాడుతుంటే ఉన్నా, లేనట్లు సంచరిస్తున్న బేరర్ లు, వాళ్ళ వైన్ గ్లాస్ లు నింపి, చీజ్ ముక్కలు, మిర్చి బజ్జీ ముక్కలు లాంటి అప్పెటైజర్ లు అందంగా అలంకరించిన ప్లేట్లు వారి ముందు పెట్టారు.

లారెన్స్ కోసం మరో సారి తలుపులు వైపు దృష్టి సారించింది లక్షి . లారెన్స్ జాడ లేదు. ఒకింత నిస్పృహ కలిగింది లక్షి కి.

వినోద్ సంభాషణ పొడిగించడానికి అక్కడ స్టేజ్ మీదకు వస్తున్న తెలిసిన వ్యక్తుల గురించి లక్షి కి చెప్ప సాగాడు.

ఇంతలో అయషా, అరసులు అందరి ముందు మరో సారి ఉంగరాలు మార్చుకొనే కార్యక్రమం మొదలయ్యింది. లక్షి కి, లారెన్స్ ఈ కార్యక్రమం చూసి, తనకు ఉంగరమిచ్చి, ప్రపోజ్ చేయాలని ఆతృత పడతాడనుకుంది. కానీ లారెన్స్ జాడ లేదు. ఆ ఆతృత తనకేనా. మరింత నిస్పృహ కలిగింది లక్షి కి.

ఆయషా, అరసు స్టేజ్ మీదున్నారు. పక్కన ఉన్న వినోద్ ఒక్క సారి ఉలిక్కి పడి, ఆశ్చర్య పడినట్లు చిన్న శబ్దం చేశాడు. లక్షి ఎందుకన్నట్లు ముఖం పెట్టి, వినోద్ వైపు తిరిగింది.

"ఆయషా, అరసులకు ఆ ఉంగరాలు అందిస్తున్నతను నాకు తెలుసు."

లక్షి స్టేజ్ మీదున్న మనుష్యులను, మరో సారి చూసింది. ఆ ఉంగరాలు అందిస్తున్న వ్యక్తి బాగా డ్రెస్ చేసుకొని, ఏదో ఒక పెద్ద బిజినెస్ నడుపుతున్న అధినేత లాగా వున్నాడు. కానీ ఆ మనిషి కొత్త నే.

"ఎవరతను?"

"అతడు సూరత్ నుండి పైకి వచ్చిన, పేరున్న వజ్రాల వ్యాపారి నితీష్ జోషి. "

"పేరు గుర్తుకు వస్తున్నది. ఈ మధ్య లోనే నితీష్ పెద్ద ఫ్రాడ్ లో ఇరుక్కున్నాడు కదా?'

“అవును. పెద్ద ఫ్రాడ్ లోనే ఇరుక్కున్నాడు. లెటర్స్ ఆఫ్ క్రెడిట్ పేరున, కొన్ని వేల కోట్ల రూపాయిలు బ్యాంక్ లో అప్పు చేశాడు. చేసిన అప్పులు గల్లంతు అయ్యాయి. ఇటీ వలే జైలు తప్పించుకోవడానికి భారత దేశం నుండి పరార్ అయ్యి అన్నీ టీ.వీ. న్యూస్ చానల్స్ లకు రెండు మూడు రోజులు అవిరామంగా అంతులేని కంటెంట్ ఇచ్చాడు. ఏంటీ, వీడు మళ్ళీ ఇక్కడ ప్రత్యక్ష మయ్యాడు?”

“ ఏ దేశానికి చెందని అంతర్జాతీయ సముద్ర ప్రదేశంలో, భారత ప్రభుత్వ అధికారాలు చెల్లవనుకుంటా. జోషి పారారయ్యే ముందు న్యూ యార్క్, పారిస్, మిలాన్ లాంటి నగరాలలో తన కంపెనీ బ్రాండ్ మీద పెద్ద పెద్ద జ్యువలరీ షాప్ లు తెరిచాడని విన్నాను.”

“అవును అది నిజమే. జోషి కి పి.ఎల్. వారి కుటుంబం తెలుసుండాలి. అందుకే, తనే స్వయంగా ఈ ఫంక్షన్ కు వచ్చి, అరసు, ఆయషాల కు డైమండ్ రింగ్ లు అందజేస్తున్నాడు.”

“అయినా నాకు అంతుబట్టని విషయం, అన్ని కోట్లు బ్యాంక్ ల నుండి డబ్బు అప్పుగా తీసుకొని, అన్ని ఏళ్లు గా మోసం చేస్తుంటే, ఎలా పట్టుబడ లేదు?”

“ మంచి ప్రశ్న. నీ నుంచి ఎదురు చూడలేదు. నువ్వెక్కడ పని చెస్తున్నావు?” వినోద్ లక్ష్మి వైపు ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.

“నాకే ఒక కన్సల్టింగ్ కంపెనీ ఉంది,” అంటూ లక్ష్మి తను ఆర్థిక రంగంలో జరిపే నేర పరిశోధనలు, రిసెర్చ్ గురించి, ఎలా ఆయషా, తన కంపెనీ కే పని చేసేదో, చెప్పింది.

“హూ. అరసు నేతృత్వంలో వస్తున్న మంచి మార్పులకు ఆయషానే కారణమని ఇప్పుడు అర్థం అవ్వుతున్నది. ఇంత పిన్న వయస్సులోనే, ఇలాంటి కంపెనీని నువ్వు నడపడం, నాకు చాలా ఇంప్రెసివ్ గా ఉంది,” పెద్ద ఉపోద్ఘాతం లేకుండా వినోద్, జోషి గురించి చెప్ప సాగాడు,” జోషి వజ్రాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకొని, మన సూరత్ నగరంలో నివసించే కళాకారుల సహాయంతో సాన బెట్టి తిరిగి ఎగుమతి చేసే వ్యాపారంతో మొదలెట్టాడు. దీని వల్ల జోషి కి వజ్రాలు సాన బెట్టిన దానికి కూలి డబ్బులే దక్కేవి. అటు తరువాత లాభాలు వజ్రాల అమ్మకంలోనే ఎక్కువున్నాయని, తనే వజ్రాలు కొని, దిగుమతి చేసుకొని, ఆ వజ్రాలు సాన బెట్టిన తరువాత అమ్మడం మొదలెట్టాడు. ఆ వ్యాపారం లో కూడా అమ్మకాలు పెరగడం తో, ఈ మధ్యే, నువ్వన్నట్లు, ప్రపంచంలో ఫ్యాషన్ కు పేరొందిన నగరాల లో తన బ్రాండ్ షాప్ లు తెరిచాడు.”

"ఇదేదో మంచి వ్యాపారం లాగానే ఉంది కదా. బ్యాంక్ ఫ్రాడ్ ఎలా జరిగింది?"

"అక్కడి కే వస్తున్నా. ఘనులలోనుంచి తీసిన, ఈ సాన బెట్టని డైమండ్ లు దిగుమతి చేసుకోవడానికి, జోషి బ్యాంక్ ల ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ లు తీసుకునే వాడు. అవి జోషి తరపున బ్యాంక్ లు వ్రాసి ఇచ్చే హామీ పత్రాలే. అలాంటి లెటర్ ఆఫ్ క్రెడిట్ ఇవ్వడానికి, బ్యాంక్ వాళ్ళు కమిషన్ తీసుకుంటారు. జోషి ఆ దిగుమతి చేసిన వజ్రాలు తిరిగి ఎగుమతి చేసి, సాన బెట్టిన దానికి ఆ విదేశీ కంపెనీకి బిల్ పంపిన తరువాత, ఆ లెటర్ ఆఫ్ క్రెడిట్ కేన్సిల్ చేయమని ఆ విదేశీ కంపనీ బ్యాంక్ కు ఆదేశాలు పంపిస్తుంది. దీని వల్ల అందరికీ లాభమే. విదేశీ కంపనీ కి జోషి తమ వజ్రాలు తీసుకొని గల్లంతు చేయకుండా బ్యాంక్ హామి ఉందని, జోషి కి ఏమి పెట్టుబడి పెట్టకుండానే, కోట్ల విలువ చేసే వజ్రాల తో వ్యాపారం చేసే అవకాశం దొరికిందని, పెద్దగా శ్రమ పడకుండానే బ్యాంక్ లకు కమిషన్ రూపంలో ఆదాయం దొరికిందని అందరికీ ఆనందమే."

"మరి ఇది సమస్యగా ఎలా మారింది."

"జోషి అత్యాశ వల్లే. సులభంగా, కమిషన్ రూపంలో తెగ లాభాలు చేసుకోవచ్చునని ఆ అత్యాశకు చేయూత నిచ్చిన బ్యాంకు ల వల్లే. అకౌంటింగ్ లో లెటర్ ఆఫ్ క్రెడిట్ లను కంటిజెంట్ లయబిలిటీ అంటారు. అంటే ఈ వ్యాపారం బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ లలో ఎక్కడో ఒక ఫుట్ నోట్ లాగా వివరాలు చూచాయగా ఇస్తారు. జోషి లాంటి వారు, తమ మాట నిలబెట్టుకో కుండా, వ్యాపారంలో అవక తవకలు చేస్తే, అవతల జోషి ని నమ్మి వజ్రాలు అప్పిచ్చిన విదేశీ కంపెనీలు బ్యాంక్ నుండి డబ్బులు వసూలు చేస్తాయి. లెటర్ ఆఫ్ క్రెడిట్ బ్యాంక్ ఇచ్చినందు వల్ల బ్యాంక్ కు మరి గత్యంతరం లేదు. లెటర్ ఆఫ్ క్రెడిట్ లో హామీ ఇచ్చిన డబ్బు మొత్తం ఆ విదేశీ కంపెనీకి పంపించి, బ్యాంక్ లు ఆ డబ్బు వసూలు చేసుకోవడానికి జోషి వెంట బడాలి. అదే జరిగింది. జోషి వ్యాపారంలో కొత్త ప్రయత్నాలు మొదలు బెట్టి, విపరీతమైన నష్టాలకు గురి అయ్యాడు. తను ఆరంభించిన బ్రాండ్ పెద్దగా నిలదొక్కుకోలేదు. నష్టం వచ్చిన విషయం తెలిసిన తరువాత పేక ముక్కలతో కట్టిన మేడల్లె మొత్తం వ్యాపారం కూలిపోయింది. బ్యాంకులకు ఆ విషయం తెలిసే లోపే, జోషి, అతని కంపనీలో పెద్ద పదవులలో ఉన్న అతని బంధువులు, దేశం వదిలేసి పరారైపోయారు. వ్యాపారం తటాలున ఆగిపోవడంతో, బ్యాంకులు లెటర్ ఆఫ్ క్రెడిట్ ల ద్వారా ఇచ్చిన హామీల వల్ల, విదేశీ కంపెనీల కి కోట్లు రుణ పడ్డాయి. ఆ డబ్బు బ్యాంక్ లు విదేశీ కంపెనీలకు తమ హామీ ప్రకారం పంపాల్సి వచ్చింది. అలా పంపించిన డబ్బు జోషి నుంచి వసూలు చేయలేక పోవడం తో ఆ డబ్బంతా బ్యాంక్ లు జోషి పేరు మీద అప్పులుగా మార్చాల్సి వచ్చింది. ఇవ్వన్నీ బయట పడడం తో కలిగిన

సంచలనం, ఆర్థిక రంగాన్ని, ప్రభుత్వాన్ని కూడా ఒక ఊపు ఊపేసాయి. 'బ్యాంకులు ఎలా ఇంత పెద్ద మొత్తంలో అప్పులిచ్చాయి? జోషి ఎలా ఈ దేశం వదిలి పెట్టి, పారిపోగాలిగాడు?' అంటూ శాసన సభలలో కూడా పెద్ద గొడవలు జరిగాయి."

"ఇప్పుడర్థం అయ్యింది. మరి భారత దేశం ప్రభుత్వం జోషి పాస్పోర్ట్ కేన్సిల్ చేసి జోషిని పట్టుకొని ఉండవచ్చు కదా?"

"నువ్వు నేర పరిశోధనలో పని చేస్తున్నావు. నీకు తెలియంది కాదు. ఈ కాలంలో డబ్బులు పోస్తే మరో దేశం పాస్పోర్ట్ కొనుక్కోవచ్చు. జోషి లాంటి నేరస్థులు ప్రభుత్వాల కంటే ఒక అడుగు ముందుంటారు. ప్రభుత్వాలు మేలుకొని జోషి మీద క్రిమినల్ గా అలెర్ట్ పెట్టే సరికి, జోషి వాటి కందని దూర తీరాలకు చేరి పోయాడు. అది నువ్వు, నేను ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాము కదా."

స్టేజ్ మీద నుంచి ఆయషా, అరసు లు దిగి పోయారు. డిన్నర్ సర్వ్ చేయడం కూడా అయ్యిపోయింది. వెయిటర్ లు టేబుళ్ళు క్లీన్ చేసి, అతిధుల కు డెసర్ట్ లు , డెసర్ట్ కాక్ టెయిల్ లు, కాఫీ, టీ లు సరఫరా చేస్తున్నారు.

లక్షి తన ఫోన్ చూసింది. క్రూయిజ్ ప్రకటనల మేసేజి కనిపించింది. ఓడ ఇక ప్రైవేటు ద్వీపంలో ఒక రెండు గంటల ముందే లంగరు వేసిందట. రేపు ద్వీపంలో చాల ఆక్టివిటీలు ఏర్పాటు చేసారు. ద్వీపంలో ఉన్న రెస్టారెంట్ లలో కావలసినంత తినడానికి ఏర్పాట్లు చేశారు. అలానే ప్రతీ గెస్ట్ కిచ్చిన కార్డు తో కావలసిన షాపింగ్ చేయవచ్చు కూడా. లారెన్స్ నుంచి మెసేజ్. అర్జంట్ గా ఆఫీస్ పని బడడం తో పడవ దిగి ద్వీపంలో అడుగు బెట్టాల్సిన అవసరం వచ్చిందని, తను తిరిగి రావడానికి రాత్రి అవ్వుతుందని, తనకోసం వేచి ఉండనవసరం లేదని. లక్షి కి చివుక్కు మంది. తను, లారెన్స్ తో కలిసి చూడాలనుకున్న ఆయషా, అరసు ల ఫంక్షన్ మిస్ అయ్యాడు. ఎందుకో లారెన్స్ తో తన భవిష్యత్తు కూడా అగమ్య గోచరంగా అనిపించింది.

"ఆర్ యు ఒకే? నీకేమి పని లేక పోతే, క్యాసినో కు పోతున్నాను. వస్తావా? అక్కడ పోకర్ గేమ్ ల పోటీలు పెట్టారు" లక్షి ముఖంలో మార్పులు చూసి అడిగాడు వినోద్.

బహుశా ఇద్దరు ఆర్థిక రంగంలో, నేర పరిశోధనలలో పని చేయడం వల్ల ఇట్టే కనెక్ట్ అయ్యిపోయారు.

“నా బాయ్ ఫ్రెండ్ నాతో బాటు ఇక్కడకి వచ్చినా, పనిలో పడిపోయాడు. చేసేదేమీ లేదు. మీతో వస్తాను. కానీ ఒక షరతు, మీరు పని చేస్తున్నప్పుడు మీకు తటస్థ పడ్డ ఇంటరెస్టింగ్ కేసుల గురించి చెప్పండి. నాకు అలాంటి కథలు వినడం ఇష్టం.”

“దానికేముంది. చాల కథలే ఉన్నాయి. ఈ పి.ఎల్. మొదట ఎలా వ్యాపారం మొదలెట్టాడో చెప్తాను...,” వినోద్ లేచి క్యాసినో వైపు అడుగులు వేస్తుంటే, లక్ష్మి కూడా అతని మాటలు వింటూ అనుసరించింది.

వినోద్ పోకర్ గేమ్ చూడలను కొన్న వీక్షకుల కని వేసిన కుర్చీలు, సోఫాల దగ్గరికి వెళ్ళి, ఇక సోఫా లో కూలబడ్డాడు. లక్ష్మి కూడా వినోద్ పక్కనే కూర్చుంది. వినోద్ మాటలు వింటుంటే, ఎదురుగా పోకర్ గేమ్ చూస్తుంటే తన ఆలోచనలు లారెన్స్ నుండి కొంచెం దూరంగా ఉంచవచ్చనుకుంది లక్ష్మి . అయినా మనస్సు పీకుతూనే ఉంది. బహుశా ఆయషా, అరసు లు ఉంగరాలు మార్చుకోవడం, లారెన్స్ కు కూడా తనకు ఉంగరం ఇవ్వడానికి, ప్రపోజ్ చేయడానికి స్ఫూర్తి ఇస్తుందనుకుంది, లక్ష్మి . ఇప్పుడవ్వన్ని అడియాశలుగా మారాయి.

ఎదురుగా పోకర్ గేమ్ నడుస్తున్నది. ఇది వరకు చూసిన జోషి కూడా ఆడుతున్నాడు. మిగిలిన వారు కూడా తనకు తెలిసిన వారే అన్నాడు వినోద్. అందరు వ్యాపారస్తులే, కంపెనీలు నడుపుతున్న వారే. ఆ గుంపులో ఒకతను నల్లగా, మంచి ఒడ్డు పొడుగుతో విలక్షణంగా వున్నాడు.

ఒక పక్క పోకర్ గేమ్ జోరుగా సాగుతున్నది. ఓడిన వారి దగ్గరి నుండి గెలిపొందిన వారికి చిప్స్ మార్పిడీలు జరిగిపోతున్నాయి.

వినోద్ పి.ఎల్. ఎలా ఒక చిన్న తోలు ఫ్యాక్టరీ నుంచి, ఇప్పటి పి.ఎల్. గ్రూప్ కు ఎదిగాడో చలోక్తులతో ఇట్టే సమయం గడిచిపోయేలా చెప్పాడు. అక్కడ పోకర్ గేమ్ ఆడుతున్న వారి చరిత్రలు కూడా చెప్పాడు. అవన్నీ దేశ చరిత్రల లాగే ‘పర పీడన పరాయణతం’. సగటు జనాలను మోసం చేసి, అణగదొక్కి పైకొచ్చిన బాపతే. చివరకి ఆ నల్లని ఆజాను బాహుడి దగ్గరికి వచ్చే సరికి వినోద్ నోట మాట లేదు.

“అక్కడ ఆట ఆడుతున్న వారందరూ నేను ప్రభుత్వానికి పని చేస్తున్నప్పుడు ఏదో టాక్స్ గొడవల్లో తారస పడిన వాళ్ళే. ఆ నల్లతను మన దేశం వాడు కాదనుకుంటాను. ఎవరో తెలియటం లేదు,” అన్నాడు వినోద్.

“నాకూ అతనిని చూస్తే ఏదో ఆసక్తి గానే ఉంది. ఆ నల్లతను ఆటను చూసారా? అతడే ఎక్కువ గెలుస్తున్నాడు. ఆశ్చర్యంగా మన జోషి కూడా ఒకటే ఓడిపోతున్నాడు. జోషి నల్లతని కార్డ్స్ చూడకుండానే తన ఆట ఫోల్డ్ చేసేసి, చిప్స్ నల్లతని వైపు తోసేస్తున్నాడు.”

“అవును మాటలలో గమనించలేదు. వీళ్ళు ఆడే గేమ్ ప్రైజ్ లు మిలియన్ల డాలర్ల విలువలో ఉంటాయి. ఆ నల్లతనికి జోషి మిలియన్ల కొద్దీ ఓడిపోయే అవసరం ఏమి వచ్చిందో?”

“జోషి నే కాదు, ఆ టేబిల్ మీద ఉన్న మిగిలిన ఆటగాళ్ళు కూడా ఆ నల్లతనికి ఓడిపోతున్నారు. నేను చూసిన మామూలు పోకర్ గేమ్ లాగా లేదు. అందరు, ఆ నల్లతనికి ఏదో సుంకం చెల్లిస్తున్నట్లు ఓడిపోతున్నారు,” అంది లక్ష్మి .

లక్ష్మి కి ఆ గేమ్ ఆసక్తికరంగా అనిపించ లేదు. మరీ వన్ సైడ్ గేమ్, ఒకరే ప్రతీ సారి గెలుస్తుండడం విసుగనిపించింది. వినోద్ చెప్తున్న కథలు కూడా చివరికి వచ్చేశాయి. అవీ బోర్ కొట్టడం మొదలెట్టాయి. లక్ష్మి కి మళ్ళీ లారెన్స్ లేని లోటు కొట్టొచ్చినట్లు తెలుస్తున్నది. వినోద్ ఆశ్చర్య పడేలా, తటాలున లేచి, వీడ్కోలు తీస్కొని, ఆ పోకర్ గేమ్ రూం నుండి బయటపడి, ఓడ డెక్ పైన అడుగు బెట్టింది, లక్ష్మి . అదీ పడవ ముందు భాగం వైపు. డెక్ వెనుక, రెండు అంతస్తుల క్రింద ఉన్న స్విమ్మింగ్ పూల్ దగ్గర జనాల అరుపులు లీలగా వినిపిస్తున్నాయి. పైన వెన్నెల పిచ్చగా కాస్తున్నది. ఓడ తీరం కు దూరంలోనే లంగరు వేసి ఆగింది. రేపు అక్కడుండే ద్వీపంలో నే యాక్టివిటీస్ ప్లాన్ చేసారు. లారెన్స్ ఉంటే, తనూ లారెన్స్ టైటానిక్ సినిమాలో లాగా ఇక్కడ పోజ్ ఇచ్చే వారా? ఆ ఆలోచన వస్తూనే లక్ష్మి కి నవ్వు వచ్చింది. మళ్ళీ లారెన్స్ లేదన్న నిస్పృహ. పని కావడానికి సమయం అవ్వుతుందని, తనని పడుకోమని క్యాసినో లో ఉన్నప్పుడు మరో మెసేజ్ పంపించాడు.

లక్ష్మి తన రూం కు వెళ్లి పడుకుంది. లారెన్స్ మధ్య రాత్రి తరువాత రూం కు వచ్చి పక్కన పడుకోవడం లక్ష్మి కి లీలగా తెలిసింది. అంత నిద్రలోనూ ‘ లారెన్స్ ఎక్కడికి వెళ్ళాడు? ఎందుకు డిన్నర్ తనతో చేయలేదు?’ లాంటి ప్రశ్నలు మదిలో ఎక్కడో దూరంగా తన గొంతుకలోనే వినిపించసాగాయి లక్ష్మి కి.

(ముగింపు వచ్చే సంచికలో)

Post your comments